సాక్షి
మెదక్
సోమవారం । 29 । జనవరి । 2024



మార్నింగ్ వాక్ రోగాలకు చెక్

ఆయుష్షు పెరగాలంటే రోజూ నడవడమే మేలని నిపుణులు చెబుతున్నారు.

వివరాలు 8లో ▸



అటెన్షన్ ప్లీజ్..!

'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఎంపికైంది.

వివరాలు 8లో ▸



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నిజాంపేట మండలం నస్కల్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. వివరాలు 9లో ▸

ఊరిస్తున్న పదవులు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి కాంగ్రెస్ కసరత్తు

- కార్పొరేషన్ చైర్మన్లపైనే పార్టీ శ్రేణుల దృష్టి
- ముఖ్యనేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలోని ఆశావహులు పోటీ పడుతున్నారు. అయితే టికెట్ ఆశించి భంగపడిన నేతలు, పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి ఇదివరకే ప్రకటించారు. అది కూడా ఈనెలాఖరు లోపు భర్తీ చేస్తామన్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు నేతలు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. సీనియర్లు పార్టీని వీడినా ద్వితీయ శ్రేణి నేతలు క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేసి మెదక్ నియోజకవర్గ సీటును గెలిపించుకున్నారు.

మెదక్: అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవులను దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జనవరి 31లోగా భర్తీ చేస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన ప్రకటన నేతల్లో ఉత్సాహాన్ని నింపింది. ఇంకా రెండు రోజుల సమయమే ఉంది. ఇప్పటికే నేతలు ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అందరి సేవలు వినియోగించుకునే దిశగా సీఎం అడుగులు వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ ఆశించి భంగపడిన వారికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామని అనేక సందర్భాల్లో గుర్తు చేశారు. ఇప్పటికే నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు ముఖ్య నేతలను కలుస్తున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన వారంతా నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని మెదక్ , నర్సాపూర్ నియోజకవర్గాల్లో ముఖ్య నేతల్లో చాలా మంది పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు మాత్రం కొనసాగుతుండగా ఇప్పుడు తమకు అవకాశం వచ్చిందని న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు.

అందరి చూపు.. కార్పొరేషన్ల వైపు

జిల్లాకు చెందిన మెజారిటీ నేతలు కార్పొరేషన్ల పదవుల కోసం పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ జిల్లా, రాష్ట్ర స్థాయి పదవుల్లో కొనసాగిన నేతలు ఇప్పుడు పార్టీలో లేరు. ఇక ద్వితీయ స్థాయి నేతలు ఈ పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు. మెదక్ నియోజకవర్గ టికెట్ రాలేదని కొందరు నేతలు బీఆర్ఎస్‌లోకి చేరితే మిగతా వారు అధైర్య పడలేదు. అధిష్టానం మెదక్ టికెట్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ రావుకు ఇచ్చినా గెలిపించుకున్నారు. మరో వైపు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యే మైనపల్లి హన్మంతరావులను సైతం కలుస్తున్నారు. ఖాళీగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఏదొకటి ఇప్పించామని కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో పదవులు దక్కని పక్షంలో జిల్లాస్థాయిలోనైనా ఇప్పించామని కోరుతున్నట్లు సమాచారం.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాలను దక్కించుకోవాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. షెడ్యూల్ వచ్చే లోపే నామినేటెడ్ పదవుల భర్తీకి కార్యాచరణ సిద్ధం చేస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో మెదక్ , జహీరాబాద్ రెండు లోక్ సభ స్థానాలున్నాయి. పార్టీ కోసం పాటు పడిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టి ఈ ఎన్నికల్లో సేవలు వినియోగించుకోవాలని అనుకుంటోంది. రాష్ట్రస్థాయిలో 54 కార్పొరేషన్ పదవులున్నాయి. జిల్లా స్థాయిలో గ్రంథాలయ సంస్థల చైర్మన్లు, రైతు సమన్వయ కమిటీ, ఆత్మకమిటీ, మార్కెట్ కమిటీ, ఆలయ కమిటీ చైర్మన్లు , డైరెక్టర్ పోస్టులున్నాయి. మెదక్ నియోజక వర్గం నుంచి సురేందర్‌గౌడ్, ప్రశాంత్ రెడ్డి, సుప్రభాతరావు , ప్రభాకర్ రెడ్డి, రామచంద్రాగౌడ్, చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, శ్రీనివాస చౌదరి, జీవన్‌రావు, పవన్‌తో పాటు పట్టణానికి చెందిన సీనియర్ నాయకుడు మంగామోహన్‌గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్, శేషసాయిరెడ్డి , సుహాసిని రెడ్డి , రవీందర్ రెడ్డి తదితర నేతలు, వివిధ మండలాలకు చెందిన సీనియర్లు ఆశావహులుగా ఉన్నారు.

న్యూస్‌రీల్

నేడు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక



నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయ భవనం

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం అధికారులు సోమవారం (నేడు) ఏర్పాట్లు పూర్తి చేశారు. బీఆర్ఎస్ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మురళీధర్ యాదవ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరడం తెలిసిందే. దీంతో ఆపార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టారు. నోటీసులు అందకముందే కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. కాగా మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్‌కు ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్.. చైర్మన్ ఎన్నిక కోసం ఏర్పాట్లు చేసింది. ఆ పార్టీకే చెందిన ఒకటో వార్డు కౌన్సిలర్ దుర్గప్పగారి అశోక్ గౌడ్ ఈ పదవికి పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

సీఐల బదిలీలు

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లాలో సీఐ ల బదిలీలు జరిగాయి. మెదక్ పట్టణ సీఐగా దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. రామాయంపేట సీఐగా బీ వెంకటేశ్, అల్లాదుర్గం సీఐగా ఎం రేణుక, తూప్రాన్ సీఐగా రెడ్డిబోయిన కృష్ణ, మెదక్ సీసీఎస్ సీఐగా ఎస్. సురేశ్‌కుమార్, నర్సాపూర్ సీఐగా రంగా కృష్ణ నియమితులయ్యారు. ఆ మేరకు ఐజీపీ ఎంజడ్ 2(ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) ఉత్తర్వులు జారీ చేసింది. రామాయంపేట, అల్లాదుర్గం, తూప్రాన్, నర్సాపూర్ సీఐలు పనిచేసిన టీ లక్ష్మీబాబు, ఎం.జార్జ్, టీ శ్రీధర్, షేక్ లాల్ మద్దార్‌లను ఐజీపీలో రిపోర్టు చేయాలని పేర్కొంది.

మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో ప్రజా గాయకుడు గద్దర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, మెదక్ జిల్లాకు ఆయన పేరు పెట్టాలని ప్రొఫెసర్ కంచ ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్దర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఇంద్రనగర్ చౌరస్తా వద్ద కౌన్సిలర్ కొల్లూరి భరత్ చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఇచ్చింది సోనియా గాంధీ అయినా.. తెచ్చింది మాత్రం గద్దర్ అని తెలిపారు. ఆయన పాట లేకుంటే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చేది కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకులు కొల్లూరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అయితే గద్దర్ విగ్రహానికి అనుమతి రావడంతో ఆదివారం సాయంత్రం భరత్‌కు కొబ్బరి నీళ్లు ఇచ్చి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య దీక్ష విరమింపజేశారు.

లష్కర్ బోనం.. పోటెత్తిన భక్తజనం



రాజగోపురం ఎదుట భక్తజన సందోహం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు.. శివసత్తుల శిగాలు, మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చే రెండో ఆదివారం రోజున నగరానికి చెందిన వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఇలవేల్పు దైవాన్ని దర్శించుకుని పులకించిపోయారు. ముందుగా.. తలనీలాలు సమర్పించి కోనేటిలో పుణ్యస్నానమాచరించారు. మట్టికుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోర్కెలు నెరవేర్చమని ఆలయ ప్రాంగణంలోని గంగిరేణిచెట్టుకు ముడుపులు కట్టారు. గుట్టపై వెలిసిన ఎల్లమ్మ దేవతకు బోనాలు సమర్పించారు.



రాయిలాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ప్రభుత్వం వివక్షను మానుకోవాలి

- గత సర్కారు మంజూరు చేసిన నిధులు రద్దు.. సరికాదు
- ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): గత సర్కారు నిధులను మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేయడం సరికాదని, ఈ రకమైన వివక్ష చూపడం మానుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవుపలికారు. ఆదివారం మండలంలోని రాయిలాపూర్, జాజితండాలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాటి సీఎం కేసీఆర్ మెదక్‌కు వచ్చి నియోజకవర్గంలోని తండాల బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ 1.46 కోట్లు, పంచాయతీకి రూ.15 లక్షలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు సైతం మంజూరు చేశారన్నారు. వాటన్నింటినీ ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోని రాగానే రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా, క్వింటాలు వరికి రూ.500 బోనస్, రూ.4వేల పింఛన్, రూ.500కే గ్యాస్, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల అమలు చేసే విషయం ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇస్తే ఇంతవరకు అర్హుల ఎంపికే జరగలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని సర్పంచ్‌లు తలెత్తుకుని తిరగవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శేఖులు, రమేష్, ఎల్లం, పద్మకిష్టయ్య, ఎంపీటీసీలు స్వప్న, ప్రవీణ్‌కుమార్, పీఆర్ డిప్యూటీఈఈ అమరేశ్వర్, ఏఈ ప్రభాకర్, జిల్లా కోఆప్షన్‌సభ్యుడు మన్సూర్, ఉసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎలా రద్దు చేస్తారు?

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): గత ప్రభుత్వం రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన అభివృద్ధి పనులకు కేటాయించిన రూ.25 కోట్ల మేర నిధులను రద్దు చేయవద్దని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఉన్న చిత్తారమ్మ ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి విషయమై తన విజ్ఞప్తి మేరకు అప్పటి సీఎం కేసీఆర్ రూ. 25 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. మున్సిపల్ కార్యాలయ భవనం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు ఇతరేత్రా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ప్రొసీడింగ్ కాపీలు వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా రద్దు చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికే 75 శాతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఈ నిధులను రద్దు కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ ప్రతినిధులు భూషణం, దత్తు.. మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పుట్టి విజయలక్ష్మి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి ఉన్నారు.



మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

కేసీఆర్ కేటాయించిన నిధులెక్కడ?



మాట్లాడుతున్న హరీశ్‌రావు

- వాటిపై నోరు మెదపని స్థానిక ఎమ్మెల్యే
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్: ఎన్నికలకు ముందు నాటి సీఎం కేసీఆర్ మెదక్‌కు వచ్చి కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించి జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారని, వాటిని స్థానిక ఎమ్మెల్యే ఎందుకు తేలేకపోయారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ గ్రాంట్ కింద మెదక్ పట్టణానికి రూ. 50 కోట్లు, ఏడుపాయల దేవస్థానం అభివృద్ధికి రూ.100 కోట్లు, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.25 కోట్లు, జిల్లాలోని ప్రతి గ్రామానికీ రూ. 15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. వాటిని తీసుకో రాకుండా స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. ఈ విషయంపై ఆయన నోరు మెదపక పోవటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని, ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్ల కల రైలు కూత, మాతాశిశు ఆస్పత్రి, రోడ్ల నిర్మాణాలు జరిగాయని గుర్తుచేశారు. మెదక్ మెడికల్ కళాశాలను సైతం మంజూరు చేశామన్నారు. ఇప్పుడు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వచ్చే రోజులు మనవేనని పార్లమెంట్ ఎన్నికల్లో అధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కార్యకర్తలను కోరారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. వాటిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, దేవేందర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యానారాయణ తదితరులు ఉన్నారు.



హాజరైన కార్యకర్తలు

కంటతడి పెట్టిన పద్మారెడ్డి

మెదక్: మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి కంటతడి పెట్టారు. ఆదివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలో నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మామిళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ పద్మారెడ్డి లాంటి మంచి నాయకురాలు ఓటమి చెందడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టకరమన్నారు. ఒక ఆడబిడ్డ అయి ఉండి కూడా ఉదయం 8 గంటలకే మెదక్‌కు వచ్చి ప్రజా సమస్యల్లో పాలుపంచుకొని, పరిష్కారానికి కృషి చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. కాగా ఈ మాటలు విని స్టేజీపైనే ఉన్న ఆమె కంటతడి పెట్టారు.

రోడ్డు పనులు వేగిరం చేయండి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కోహెడరూరల్(హుస్నాబాద్): రోడ్డు పనులు వేగిరం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని శనిగరం గ్రామం నుంచి కోహెడ మండల కేంద్రానికి రూ.18కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్‌రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల నాణ్యతను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఐఆర్ఎఫ్ నిధుల నుంచి చేపట్టిన రోడ్డు నిర్మాణం మూడు నెలలు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు గత పాలకులకు భయపడి పనులలో జ్యాపం చేశారని అన్నారు. నిధులు కేంద్రానివి పేరు రాష్ట్రానిదని మండిపడ్డారు. పనుల్లో ఎందుకు జ్యాపం జరిగిందో వారం రోజుల్లో రిపోర్టు ఇవ్వాలన్నారు. రోడ్డు పనులు నాణ్యత లోపిస్తే కాంట్రాక్ట రద్దు చేస్తామని తెలిపారు. తంగళ్లపల్లిలో నూతన గ్రామ పంచాయతీని బండి సంజయ్ సందర్శించారు. కేసీఆర్ పాలనలో సర్పంచ్‌లకు బిల్లులు రాక దారుణమైన పరిస్థితులు ఎదుర్కొన్నారని అన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బొమ్మశ్రీరాం చక్రవర్తి, పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, గుగ్గిల శ్రీనివాస్, కంది సత్యనారాయణరెడ్డి, రజినీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు వల్లే జిల్లా వెనుకబాటు

- జిల్లా కార్యాలయాలు సిద్దిపేటకు తరలించారు
- మీ ప్రాంతానికే వచ్చి అసలు బండారం బయటపెడతా
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్: హరీశ్‌రావు వల్లే మెదక్ ప్రాంతం పూర్తిగా వెనుకబడిందని, జిల్లాకు చెందిన కార్యాలయాలతో పాటు సర్వం దోపిడీ చేశారని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకొని తనను విమర్శిస్తున్నారని, ఆయన ఇక్కడికి వచ్చి విమర్శించడం కాదు తానే సిద్దిపేటకు వచ్చి అసలు బండారం బయటపెడ్తానన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్.. మెదక్ జిల్లాకు నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే ఎందుకు తేవటం లేదని ఆయన వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇవి ఎప్పుడు విడుదలయ్యాయో చెప్పాలని, అబద్దాలు మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని ఏ మేర దోపిడీ చేసింది ప్రజలకు తెలుసునని, అందుకే ఇంట్లో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, సీసీరోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీలు, ఇతర పనులు చేపడతామన్నారు. ఈ ప్రాంతంలో చరిత్రను తెలిపే ఖిల్లా, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చర్చి, ఏడుపాయల దేవస్థానం, పోచారం అభయారణ్యం ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలను పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, అభివృద్ధి చేసేందుకు ఎప్పుడూ ముందు ఉంటానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్, జీవన్‌రావు, గంగా తదితరులున్నారు.



చిన్నశంకరంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

ప్రభుత్వంపై విమర్శలు తగవు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సుమారుగా రెండు నెలలే అవుతోందని, అప్పుడే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు గుప్పిస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చిన్నశంకరంపేటలో రూ.కోటితో నిర్మించిన రాధేశ్యామ్ ఫంక్షన్ హాలు, మండలంలోని టీ.మాందాపూర్, రుద్రారంలో పంచాయతీల భవనాలు, గవ్వలపల్లిలో యువజన సంఘం భవనాన్ని ప్రారంభించి, మల్లుపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. కనీస సమయం కూడా ఇవ్వకుండా ఆయన విమర్శలు చేస్తున్నారన్నారు. వారం రోజుల్లో తాను సిద్దిపేటకు వెళ్లి మాజీమంత్రి.. అసలు బండారాన్ని బయటపెడ్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భిక్షపతిగౌడ్, మంగాదేవి, లక్ష్మీనర్సయ్య, రాజిరెడ్డి, దయానంద్, పోచయ్య, ఎంపీటీసీలు ప్రసాద్‌గౌడ్, శివకుమార్, కాంగ్రెస్ నాయకులు గంగా నరేందర్, అరుణప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ స్పీడ్‌ను తట్టుకోలేరు

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు




మాట్లాడుతున్న హన్మంతరావు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ స్పీడ్‌ను ఎవరూ తట్టుకోలేరని, మరో 20 ఏళ్ల పాటు ప్రజాశీర్వాదంతో రేవంత్‌రెడ్డే సీఎంగా కొనసాగుతారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం మండలకేంద్రానికి విచ్చేసిన సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ఆరోపించారు. రాజకీయంగా తాను జీవితాన్నిచ్చిన వారు నేడు తన వెంట లేరన్నారు. ముఖ్యంగా యువత తన వెంట ఉంది కాబట్టే మెదక్ ఎమ్మెల్యేగా రోహిత్ గెలిచాడన్నారు. ఈ ప్రాంతాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాడన్నారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ కేబినెట్ బాగా పని చేస్తుందన్నారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని, ఎమ్మెల్యే రోహిత్.. అభివృద్ధి పనులు చూసుకుంటాడని పేర్కొన్నారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ విప్లవ్‌కుమార్, తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం దిశగా తూప్రాన్ మున్సిపాలిటీ

చైర్మన్ ఒంటెత్తు పోకడ, అవినీతికి వ్యతిరేకంగానే అంటున్న కౌన్సిలర్లు

తూప్రాన్: తూప్రాన్ మున్సిపాలిటీ పరిణామాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. చైర్మన్‌పై అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. తూప్రాన్ మున్సిపాలిటీలో మొత్తం 16 మంది కౌన్సిలర్లుగాను బీఆర్ఎస్ తరుపున 13 మంది, కాంగ్రెస్ తరుపున ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు ఎన్నికయ్యారు. అప్పట్లో బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశాలకనుగుణంగా చైర్మన్‌గా బొంది రాఘవేంద్రగౌడ్, వైస్ చైర్మన్‌గా నందాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆతర్వాత క్రమంగా చైర్మన్‌కు, కౌన్సిలర్లకు మధ్య సఖ్యత కొరవడింది. నిధుల వ్యయం విషయంలో విభేదాలు బయటపడ్డాయి. పరస్పరం పత్రిక ముఖంగా ఆరోపణలు చేసుకోవడం, అదికాస్త అవినీతి ఆరోపణలకు సంబంధించి బుక్ లెట్ల ప్రచురణ విడుదల వరకు వెళ్లడం తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో చైర్మన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 10 మంది కౌన్సిలర్లు క్యాంపుల్లోకి వెళ్లి అవిశ్వాసమే లక్ష్యంతో కలిశారు. ఇదే విషయమై ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. చైర్మన్ ఒంటెత్తు పోకడ, అవినీతికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైనట్లు వివరించారు. వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో తూప్రాన్ మున్సిపాలిటీ వ్యవహారం ఆసక్తికరంగా మారింది.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మెదక్ మున్సిపాలిటీ: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెదక్‌కు చెందిన 14 మంది విద్యార్థులు పతకాలు సాధించినట్లు రెంజుకి షాటోకాన్ వ్యవస్థాపకుడు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇండియా, భూటాన్, జపాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌తో సహా 30 దేశాల నుంచి 3 వేల మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు.



పతకాలు సాధించిన మెదక్ విద్యార్థులు

క్లుప్తంగా

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


లారెన్స్


మాధవి

గజ్వేల్: జాతీయ జూనియర్ చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. గజ్వేల్‌లో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర 49వ జూనియర్ చాంపియన్‌షిప్ కబడ్డీ పోటీల్లో ఇద్దరు ప్రతిభ కనబర్చారు. జిల్లాలోని గుడికందుల గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మాధవి బాలికల విభాగంలో, హుస్నాబాద్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి లారెన్స్ బాలుర విభాగంలో ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్‌లోని బాచుపల్లిలో నిర్వహించనున్న జాతీయ చాంపియన్ షిప్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. అలాగే, తెలంగాణ కబడ్డీ జట్టు మేనేజర్‌గా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ ఎంపికయ్యారు. వీరిని అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు అభినందించారు.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి మరోకారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన ఆదివారం రాత్రి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పటాన్‌చెరు జాతీయ రహదారిపై శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో ముందు వెళ్తున్న కారుని వెనుక వేగంగా వచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ముందు కారు డివైడర్ దాటుకొని అవతల వైపు వస్తున్న నారాయణఖేడ్ డిపో ఆర్టీసీ బస్సు కిందకి దూసుకెళ్లింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యి అందులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు చంద్రశేఖర్, శ్యామల వారి రెండేళ్ల మనుమరాలు వర్షికకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ మెకానిక్ ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: ఉరివేసుకొని బైక్ మెకానిక్ మృతి చెందిన ఘటన మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు బల్యాల రాజలింగం తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లికి చెందిన బల్యాల మహేశ్(24) మెదక్ పట్టణంలోని ఆటోనగర్‌లో సాయిదత్తా థియేటర్ ఎదురుగా బైక్ మెకానిక్ షాపులో ఏడేళ్లుగా పని చేస్తున్నాడు. శనివారం పని ముగించుకొని ఇంటికి రాపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు వెతికారు. షాపు వద్దకు వెళ్లి చూడగా స్నేహితులకు ఉరివేసుకొని కనిపించారు. అదే రాత్రి వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి చెన్నాయిపల్లి గ్రామ సర్పంచ్ బండారు శివరాములుకు తెలిపారు. ఆదివారం తెల్లవారు జామున సర్పంచ్ మృతుడి సోదరుడు రాజలింగంకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

హవేళిఘణాపూర్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ మండలం పేరూర్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరూర్‌కు చెందిన కంచనపల్లి నర్సింలు(34) మెదక్ వెళ్లి వస్తుండగా, పాపన్నపేట మండలం నార్సింగికి చెందిన పోచయ్య, కృష్ణ మరో బైక్‌పై మెదక్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో రెండు బైక్‌లు ఢీకొనగా నర్సింలు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మృతుడికి సువర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వాక్.. రోగాలకు చెక్

- అరగంట నడిస్తే అలసట మాయం
- వాకర్స్‌లో పెరుగుతున్న ఉత్సాహం
- ఉరుకుల పరుగుల జీవితంలో నడకకు ప్రాధాన్యం
- పట్టణాలతోపాటు పల్లెల్లోనూ వాకింగ్
- సంపూర్ణ ఆరోగ్యమంటున్న వైద్యులు




కాలనీ పార్కులో షటిల్ ఆడుతున్న వాకర్స్

సంగారెడ్డి టౌన్: ఉరుకుల పరుగుల జీవితం.. కాలంతో పోటీ పడుతూ సాగే జీవనం.. ఈ రోజుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది. పర్యావరణం, ఆహార జీవనశైలిలో మార్పులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. చిన్న వయస్సులోనే అనుకోని రోగాల బారినపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండాలన్నా... ఆయుష్షు పెరగాలన్నా ప్రతిరోజూ నడవడమే మేలని చెబుతున్నారు నిపుణులు. నడకతో పాటు తేలికపాటి వ్యాయామం కూడా అవసరమని సూచిస్తున్నారు.


అంబేడ్కర్ స్టేడియంలో నడుస్తున్న వాకర్స్

వయస్సుతో సంబంధం లేకుండా..

జిల్లాలో ప్రజలు వాకింగ్‌పై దృష్టి పెట్టారు. సంగారెడ్డిలోఎక్కువగా అంబేడ్కర్ స్టేడియం, తార డిగ్రీ కళాశాల, కాలనీలలోని పార్కుల్లో, మహబూబ్ సాగర్ చెరువుపై ఉదయం, సాయంత్రం వేళలో వాకింగ్ చేస్తూ ఉంటారు. దీంతో తెల్లవారక ముందే రోడ్లు, మైదానాలు సందడిగా మారుతున్నాయి. పల్లె, పట్నమనే తేడా లేకుండా వా'కింగ్'లతో దర్శనమిస్తున్నాయి. ఎముకలు కొరికే చలిలోనూ, కమ్ముకున్న పొగ మంచులోనూ నడుస్తున్నారు. ఆరోగ్యం కోసం, అలసట నుంచి విముక్తి కోసం శ్రమిస్తూనే ఉన్నారు. శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల శరీరం రోగాల పుట్టగా మారుతుంది. ఇలాంటి తరుణంలో ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. ఉదయమే లేస్తున్నారు.. నడుస్తున్నారు.. జాలువారుతున్న పొగ మంచులో ఆరోగ్యంతోపాటు ఆహ్లాదాన్ని వెతుక్కుంటున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా, చిన్నా, పెద్ద, పురుషులు, మహిళలు, వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. తమ ఆరోగ్యం కోసం తీరిన సమయంలో ఒక గంట కాళ్లకు పని చెబుతున్నారు.

గంటపాటు చేస్తే మేలు..



నేను కొన్నేళ్ల నుంచి వాకింగ్ చేస్తున్నాను. ఆర్యోగంగా ఉండడం కోసం ఒక గంటపాటు కాళ్లకు పని చెబుతున్నాను. ఎటు వంటి అనారోగ్య సమస్యలు వాకింగ్‌తో నయం చేసుకోవచ్చు. నడకతో కండరాలు బలోపేతం అవుతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తుంది. నడక సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచుతుంది.. ప్రజల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా పార్కులు, కాల్వ గట్లపై నడిస్తే మంచిది.

– లింగాగౌడ్, ప్రధానోపాధ్యాయుడు, వాకర్

వాకింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం



ప్రస్తుతం ప్రజలు క్షణం తీరిక లేని సమయం గడుపుతున్నారు. అయినప్పటికీ నడక తప్పనిసరి చేస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. వివిధ అనారోగ్య సమస్యలను కొంత వరకు తగ్గించుకోవచ్చు. గుండె జబ్బులు ఉన్న వారు వాకింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లను దగ్గర పెట్టు కోవాలి. వాకింగ్ చేస్తే గుండె కొట్టుకునే వేగం పెరగాలి. చెమట పట్టేటట్లు చేయాలి.

– పరశురామ్, ప్రముఖ వైద్య నిపుణులు

భారీ అగ్ని ప్రమాదం

- ఎనిమిది కార్లు, మూడు ఆటోలు, 36 బైక్‌లు దగ్ధం
- లింగంపల్లి పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్‌లో ఘటన


మంటలార్పుతున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో భారీ అగ్ని ప్రమాదం జరిగి కార్లు, బైక్‌లు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి పోలీస్ క్వార్టర్స్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం, చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, కార్లను లింగంపల్లి చౌరస్తాలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఉంచారు. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు వ్యాపించి 8 కార్లు, 36 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. బెల్ సీఐఎస్ఎఫ్, పటాన్‌చెరు ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురాగా అప్పటికే వాహనాలు కాలిపోయాయి. ఏసీపీ నర్సింహారావు, రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. పోలీస్ క్వార్టర్స్ సమీపంలోని మార్కెట్ వద్ద ఎవరో సిగరెట్ తాగి పడేసి ఉంటారని, దీంతో మంటలు వ్యాపించి ఉంటాయని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతామని తెలిపారు.


మంటల్లో కాలిపోయిన బైక్‌లు

భారీగా మద్యం పట్టివేత

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

అల్లాదుర్గం(మెదక్): బెల్టు షాపులో అక్రమంగా నిల్వచేసిన భారీ మద్యం నిల్వలను స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకున్న ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వేర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివ బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందడంతో దాడి చేసి సుమారు 85 వేల విలువ చేసే మద్యం పట్టుకున్నామన్నారు. ఇందులో 126 బీర్లు, ఇంపీరియల్ బ్ల్యూ క్వార్టర్లు 97, రాయల్‌స్టాగ్ 27 క్వార్టర్లు, డక్కన్ బ్లూ 61 క్వార్టర్లు, డబుల్‌కిక్ 97 క్వార్టర్లు, ఆఫీసర్స్ ఛాయిస్ 93 క్వార్టర్లు, 8పీఎం రెండు ఆఫ్‌బాటిల్స్ పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శివపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఇంటిపైన ఆడుకుంటుండగా ఘటన

హుస్నాబాద్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బస్ డిపో వెనుక మారుతి కాలనీకి చెందిన సయ్యద్ సంశీర్‌కు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సయ్యద్ సాధీక్ అన్వర్ (6) ఇంటిపైన ఇనుప టేపుతో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు ఇంటి వెనుకాల పైనుంచి వెళ్తున్న కరెంట్ వైర్లకు టేపు తాకి విద్యుదాఘాతానికి గురైయ్యాడు. కుటుంబ సభ్యులు ఇంటి పక్కనే తుమ్మ చెట్టు కొడుతుండగా, ఒక్కసారిగా ఇంటి పైనుంచి పొగలు రావడాన్ని గమనించారు. వెంటనే వెళ్లి చూడగా సాధీక్ శరీరం మొత్తం కాలిపోయి మృతి చెందాడు. క్షణాల్లో కుమారుడు విద్యుత్ షాక్‌కు బలికావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటనను తెలుసుకున్న సీఐ కిరణ్, ఎస్సై మహేశ్, కౌన్సిలర్ చిత్తారి పద్మ రవీందర్ ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


సాధీక్ మృతదేహం

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని మంజీర నదిలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్సై డి.మహిపాల్ రెడ్డి తెలిపారు. పొడిచన్‌పల్లి గ్రామ శివారులో సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం లభించిందన్నారు. చేపల వేటకు వెళ్లి చనిపోయి ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే పాపన్నపేట పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడు తెల్లటి దోవతి, పసుపు పచ్చ షర్ట్ ధరించి ఉన్నాడని వివరించారు.


గుర్తు తెలియని వ్యక్తి

అనుమానాస్పద స్థితిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అనుమానస్పదస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం భారతీనగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఐజీ కాలనీ గేటు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌ని పిలిపించి పరీక్షించగా ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు నుంచి 60 ఏళ్లు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వంటిపై పసుపు, నలుపు రంగు షర్టు, గ్రే రంగు ప్యాంట్ ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే రామచంద్రాపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

వ్యవసాయ భూమిలో..

నారాయణఖేడ్: నారాయణఖేడ్– రాయిపల్లి రోడ్డులోని ఖేడ్ మండలం జూకల్ శివారులో అంత్వార్ గ్రామానికి చెందిన పుప్పాల మాణయ్య వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

అనారోగ్యంతో మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: కొంతకాలంగా బీపీ సమస్యతో బాధపడుతున్న మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీ పార్క్ హోమ్స్‌కు చెందిన సుహాసిని(40) శనివారం రాత్రి ఇంట్లో నిద్రించింది. ఆదివారం ఉదయం భర్త రామ సుబ్బారావు నిద్రలేపగా లేవలేదు. వెంటనే భార్యను చికిత్స కోసం అమీన్‌పూర్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతురాలి భర్త రామ సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొగుట(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో గాయపడిని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. తొగుట ఎస్‌హెచ్‌వో మల్లేశం కథనం మేరకు.. మండల పరిధిలోని రాంపురం గ్రామానికి చెందిన అప్పనపల్లి స్వామి (48) ఈ నెల 27న మూత్ర విసర్జ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం రోడ్డు పై నడుచుకుంటూ వాగుగడ్డ నుంచి ఇంటికొస్తుండగా తొగుట నుంచి వాగుగడ్డ వైపు బైక్‌పై వస్తున్న గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన ఆకుల శ్రీకాంత్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్వామి తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని మల్లేశం తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్..!

- జహీరాబాద్ రైల్వే స్టేషన్‌కు మహర్దశ
- అమృత్ భారత్ కింద ఎంపిక
- రూ. 24.4 కోట్లతో అత్యాధునిక పనులు
- ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి..

జహీరాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయి. అత్యాధునిక హంగులతో అభివృద్ధి చెందబోతోంది. దేశంలోని రైల్వే స్టేషన్లను ఆధునీకరించి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తేవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'అమృత్ భారత్ స్టేషన్' పథకం కింద జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఎంపికైంది. ఈ పథకం కింద స్టేషన్ ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 24.4 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు అభివృద్ధి పనులు రయ్ రయ్‌మంటూ కొనసాగుతున్నాయి.

– జహీరాబాద్ టౌన్


జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న ఫ్లాట్‌పామ్ పనులు

జహీరాబాద్ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి, లాతూర్, విజయవాడ, షిర్డీ, సికింద్రాబాద్, హైదరాబాద్, వికారాబాద్, పూర్ణ, నాందేడ్, బెంగళూర్, బీదర్ తదితర ప్రాంతాలకు రైలు సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి రోజూ వెయ్యి మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం స్టేషన్‌లో సదుపాయలు అంతంత మాత్రంగా ఉన్నాయి. మౌలిక సదుపాయలైన సులభ్ కాంప్లెక్స్, తాగు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండో ఫ్లాట్‌ఫామ్ వైపు సౌకర్యాలు లేవు.

మొదటి దశలో 21 స్టేషన్‌లు

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లు దీర్ఘకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేస్తుంటారు. రాష్ట్రంలోని 39 స్టేషన్‌లను ఈ పథకం కింద చేర్చగా మొదటి దశలో 21 స్టేషన్‌లను ఎంపిక చేసింది. అందులో జహీరాబాద్ రైల్వే స్టేషన్ కూడా ఉంది. ఈ పథకం కింద జహీరాబాద్‌కు రూ.24.4 కోట్లను మంజూరు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ ద్వారా ఆగస్టు 6న బటన్ నొక్కి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. అనుకున్న సమయానికి పనులు పూర్తయితే జహీరాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలే మారిపోనున్నాయి.

ప్రారంభమైన పనులు

ప్రధాని శంకుస్థాపన చేసిన తర్వాత రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. స్టేషన్‌లో ఒక రైల్వే ఫ్లాట్‌పామ్ ఉండగా రెండో ఫ్లాట్‌పామ్‌ను నిర్మించారు. మొదటి ఫ్లాట్‌పామ్‌ను కూడా విస్తరిస్తున్నారు. వెయిటింగ్ హాల్స్, ఆధునికి టికెట్ కౌంటర్, మోడల్ షాపింగ్ మాల్, సులభ్ కాంప్లెక్స్ పనులు కొనసాగుతున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉండగా రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి సదుపాయం కల్పించనున్నారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కల పెంపకం, గార్డెన్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇప్పటికే దుకాణాల సముదాయాల నిర్మాణాలను చేపట్టారు. ఒకే బుకింగ్ కౌంటర్ ఉండగా మరో కౌంటర్ ఏర్పాటు కానుంది. మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించేందుకు పనులు చేపట్టారు. జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడూ దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కేకేబీ గుప్త, అడిషనల్ డివిజనల్ ఇంజినీర్ ఎల్.భిక్షపతి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.


జహీరాబాద్ స్టేషన్‌ను సందర్శిస్తున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు (ఫైల్)

కాలకృత్యాలు తీర్చుకొని వస్తుండగా..

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రాజ్‌కుమార్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: రైలు ఢీకొని మృతి చెందిన ఘటన గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ శివారు (బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధి)లో ఆదివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూ నాయక్, బేగంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రంలోని సిండేఘా తాలుకా, గిర్ద ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్ భారిక్(24) మండల పరిధిలోని బంగ్లా వెంకటాపూర్ సమీపంలో జరుగుతున్న భూగర్భ సొరంగం పనుల్లోని కూలీలకు వంట చేసేందుకు ఏడాది క్రితం వచ్చాడు. వినికిడి లోపం ఉన్న రాజ్‌కుమార్ ఆదివారం కాలకృత్యాల కోసం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో సిద్దిపేట–సికింద్రాబాద్ మార్గంలో నడుస్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైలు ప్రమాద విషయం తెలుసుకున్న కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడిలో 28 గొర్రెల మృతి

బెజ్జంకి(సిద్దిపేట): కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోహెడ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన శ్రీధర్ హైద్రాబాద్‌లో నివసిస్తాడు. ముత్తన్నపేటలోని తన వ్యవసాయ భూమిలో గొర్రెల షెడ్డు వేసి కాపరులను పెట్టి సుమారు 170 గొర్రెల పెంపకం చేపట్టాడు. కాపరి రోజులానే శనివారం రాత్రి గొర్రెలను షెడ్డులో ఉంచి ఇంటి కెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చేసరికి గొర్లు మృతి చెంది ఉన్నాయి. కుక్కలు దాడి చేయడంతో 28 గొర్రెలు మృతి చెందాయని బాధితుడు శ్రీధర్ తెలిపారు. సుమారు రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని వాపోయారు.


మృతి చెందిన గొర్రెలు

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


రవికుమార్(ఫైల్)

ములుగు(గజ్వేల్): కడుపు నొప్పితోపాటు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు మండలం సింగన్నగూడ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజంగార్ జిల్లా షేక్‌పూర్ బచౌలి గ్రామానికి చెందిన రవికుమార్ (27) ఏడు నెలల క్రితం ములుగు మండలం సింగన్నగూడ గ్రామానికి వచ్చి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా కడుపునొప్పితోపాటు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం సాయంత్రం కడుపులో నొప్పిగా ఉందని కంపెనీలో చెప్పి గ్రామంలోని అద్దెకుంటున్న ఇంటికొచ్చాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.